# వర్గమూలాలు

-పెద్దింటి అశోక్ కుమార్

పొయ్యి మీద సద్దిపులుసు సల్లపెల్ల మసులుతుంది. గంగ మనసు కూడా అలాగే మసులుతుంది. అంతా తనవాళ్లుగానే కనిపిస్తున్నారు. ఆపదకు సంపదకు ఊరు ఊరంతా తన వెంట ఉండేవాళ్లుగానే కనిపిస్తున్నారు. మొన్నటికి మొన్న తన భర్తను ఎంపీటీసీగా పెద్ద మెజారిటీతోనే గెలిపించారు. నవ్వుల్లో చేతల్లో మాటల్లో అంతా కలుపుగోలుగానే ఉంటున్నారు. ఎక్కడా ఎవరూ దొరకడం లేదు. కానీ ఈ తేడా ఏమిటి...?

తనను కులంతో ముడిపెట్టి చూడాలనే ఆలోచన వీళ్లకు ఎక్కడ మొదలవుతుంది? ఇంత కలుపుగోలుతనంలో... ఇంత చనువులో తన గుణాన్ని కాదని కులంతో వేరుచేసి చూడాలనే ఆలోచనకు బలమైన కారణం ఏంటిది...? దీని మూలాలు ఎక్కడున్నాయి...?

ఆలోచిస్తుంది గంగ. సమాధానం లేని ఎన్నో ప్రశ్నలు. ఇలాంటి ఆలోచనలు ఇంతవరకు ఎప్పుడూ రాలేదు. అసలు అలాంటి సంఘటనలే ఎదురుకాలేదు. తను ఎస్సీ అయినా... ఊరికి దూరంగా ఉన్నా అందరి ఇండ్లలోకి వెళ్లింది. అందరితో చనువుగా ఉంది. ఎవరితో ఏ సమస్యా తలెత్తలేదు. అసలు సమస్యంతా పెత్తిరమాసనాడు మొదలయింది.

ఎప్పుడూ ఎస్సీ కాలనీ వాళ్లంతా బతుకమ్మను పేర్చి ఒక్కచోట పెట్టి ఆడుకునేవారు. అక్కడి నుండి అటే చెరువు దిక్కు వెళ్లేవారు. ఈసారి చాలామందికి సుట్టిముట్టు దచ్చి పండుగు లేకుండా పోయింది. ముట్టుడు లేని నాలుగైదు ఇండ్లు సోపతి లేదని పేర్వలేదు. గంగ ఒక్కతే మిగిలింది. తను కూడా పేర్వననుకుంది. భర్త మాత్రం పట్టు విడవలేదు. పేర్చి ఊర్లెకు తీసుకుపొమ్మని చెప్పాడు. అక్కడికీ అతనికి నచ్చజెప్పాలని చూసింది గంగ. శంకర్ వినలేదు.

"మనను కాదనేటోళ్లు ఎవలు...? కలువనియ్యనోళ్లు ఎవలు...? ఊర్లె నీకు తెలువనోళ్లు ఎవలు? పేర్సుడు పేర్సుడే! చిన్నప్పుడైతే మా నాయిన కర్నాల బతుకమ్మ మోత్తుండె అంత పెద్ద బతుకమ్మ మేము గూడా పేర్సుకోవాలనుకున్న. మా అవ్వనడిగితే లందల లచ్చిమిదేవి నిలువది బిడ్డా అంటుండె. ఇప్పుడన్నా మనం పేర్సుకుందాం" అన్నాడు. గంగ మారుమాట చెప్పలేదు. ఎక్కడో అనుమానంగా ఉన్నా ఒప్పుకుంది.

అట్ల బతుకమ్మనాడు హనుమండ్ల గుడిమీద వైనాల పంపకం. అందరిలాగే అట్లు పోసుకుని తెల్ల చీర కట్టుకుని శిబ్బిలో బతుకమ్మను తీసుకుని పోయింది గంగ. హనుమండ్ల గద్దె ఎక్కిందో లేదో అక్కడ భూకంపం వచ్చినట్టయింది. ఆడవాళ్లంతా గునగునలు పెట్టుకున్నారు. గంగ వైనాన్ని ఎవరూ అందుకోలేదు. ఒకరిద్దరు మొహమాటానికి అందుకున్నా అట్లను పక్కన పెట్టారు. ఎప్పుడూ గంటసేపైనా కూర్చుండి గౌరీముద్దలు అందుకునే వారు ఆరోజు ఎవరో తరుముతున్నట్టు వెళ్లిపోయారు. కనీసం చెంపలకు పసుపు కూడా రాసుకోలేదు.

గంగకు గుండెలో కలుక్కుమంది. అప్పటికీ ఎవలో ఉగ్గపట్టుకుని మొఖం ముందే "ఎవలకు ఒమ్మే పనులు వాళ్లే చెయ్యాలె. గుండ్లు మునిగి బెండ్లు తేలునంటే గిదేనేమో! నాడు లేదు నేడు లేదు నాగెల్లి నాడు డోలు గొట్టెనన్నట్టు తాతల తండ్రులనాడు లేదుగని ఇయ్యల్ల తెల్లగ బతుకుతున్నమని బతుకమ్మని ఎత్తుకు రాంగనే సరిపాయెనా!" అన్నది.

గంగకు నోట మాట రాలేదు. మొఖం మాడ్చుకుని ఇంటికి వచ్చింది. భర్తతో విషయం చెప్పలేదు కాని పెద్ద బతుకమ్మను పేర్వనని మాత్రం చెప్పాలనుకుంది. తెల్లారి ఆ విషయమే కదిపితే మధ్యలో ఆపేయడం మంచిది కాదని అంతగా ఇష్టం లేకుంటే వచ్చే ఏడుకు మానెయ్యమని చెప్పాడు. గంగకు భయం పట్టుకుంది.

'గంగమ్మా... ఓ గంగమ్మా... ఉన్నవా లేదా...?' బయట నుండి పిలుపు.

ఆలోచనల్లోంచి తేరుకుంది గంగ. కిటికీలోంచి తొంగి చూసింది. వాకిట్లో రెడ్డీలమ్మ నిలబడింది. పేరు వెంకట నర్సవ్వ. ఆ పేరుతో ఎవరూ పిలువరు. అందరూ రెడ్డీలమ్మనే అంటారు. సద్దిపులుసులో కల్యామాకు దూసిపోస్తూ 'ఆ... ఉన్న. లోపలికి రామ్మా' అన్నది గంగ.

రెడ్డీలమ్మ వచ్చి సోఫాలో కూసుంది. ఆయాసంతో ఎగపోత్తుంది. ఆమెను చూడగానే అర్థమయింది గంగకు. అడిగేలోపునే చెప్పడం మొదలుపెట్టింది రెడ్డీలమ్మ.

"కాళ్లు చేతులు ఒక్కటే గుంజుడు. మంటలు పోట్లు. వారం రోజుల కింద నెత్తినొప్పికి రెండు గోళీలు ఇచ్చినవు. పెట్ల గుంజింది. డాక్టర్ బాలయ్య కొరకు చూత్తే ఇంటాంకలత్తలేడు. రెండు గోళీలుంటె ఇయ్యరాదు." బాధగా అడిగింది. ఇద్దరు కొడుకులు. పట్నంలో ఉద్యోగాలు. ఏం జరిగిందో చెప్పదు. ఎప్పుడూ కొడుకుల దగ్గరికి పోదు. భర్త లేడు. ఒక్కతే ఉంటుంది ఇంట్లో.

"ఆ... ఇస్త ఉండు..." అంటూ గోళీల డబ్బా తెరిచింది గంగ. నర్సింగ్ కోర్సు గూడా పూర్తి చేసింది కాబట్టి మందుల గురించి తెలుసు. ఊర్లో అంగన్‌వాడి టీచర్‌గా పని చేస్తుంది. పిల్లల తల్లులతో దగ్గరి సంబంధం ఉంటుంది. వారికి ఆరోగ్య విషయాలు చెబుతుంది. చిన్న చిన్న రోగాలకు మందులు ఇస్తుంది. ఎవరి దగ్గరా పైసా తీసుకోదు. ఎప్పుడూ నాలుగు రకాల మందులు నిలువ ఉంచుతుంది. నాలుగు గోళీలు తీసి ఇచ్చింది గంగ.

"నీ కడుపు సల్లగుండ. ఎప్పుడచ్చినా లేదనవు. రెండు గోళీలు మింగి మలుసుకుని పంట." అంటూ లేచింది రెడ్డీలమ్మ. మూడడుగులు ముందుకు వేసి మల్లెసల్లకు తొంగి చూసి "అగో... అదేంటిది" అన్నది నిలబడి.

"కాయిదంపూల బతుకమ్మ. గునుకపువ్వు, తంగేడు పువ్వు యాడ దొరుకుతుంది. మీ మనుమనికి బతుకమ్మ అందరికంటే పెద్దగుండాలె. గందుకే తీసుకున్న" అన్నది గంగ.

రెడ్డీలమ్మ ఆశ్చర్యంగా చూస్తూ "అగో... మీ కులపోళ్లు ఎవలూ పేరుత్తలేరట గదా! ఒక్కదానివి యాడ పెడుతవు" అడిగింది.

గంగకు ఏం చెప్పాలో ఎలా చెప్పాలో అర్థం కాలేదు. ఆమె మనసులో ఏముందో అర్థమయింది. అందుకనే సూటిగా "పెట్టుడుకు జాగ కరువైందా... ఊర్లెకు తీసుకపోత. నన్ను వద్దంటరా." అన్నది కోపాన్ని అనుచుకుంటూ.

"ఏ... అంతేగనీ... ఇప్పుడు ఎనుకటి లెక్క పద్ధతులున్నయా...! అందరు గౌరమ్మను నిలవెడుతండ్రు. గణపతి పండుగైతే కోమటోళ్లు ఒక్కలే ఇండ్లల్ల నిలవెడుదురు. ఇప్పుడు ఇల్లిళ్లుకూ వాడవాడకూ అదేనాయె. ఆగుతన్నారు..." అంటూ కలుపుగోలుగా బయటపడింది రెడ్డీలమ్మ.

గంగకు పుండు మీద కారం సల్లినట్టయింది. ఇంతదాకా అదే ఆలోచనలతో ఉందంటే ఇప్పుడు మళ్లీ అవే సుడులు తిరుగుతున్నాయి. తన చుట్టూ పరుదులను గీచి తను అందులో మాత్రమే తిరుగాడుతున్నంత సేపు ఎక్కడా ఏమి జరగదు. అందరూ చల్లని చూపులతో దీవెనలిస్తారు. ఎక్కడా ఏమాత్రం తను గీత దాటినా అడుగడుగునా వీళ్లు సంస్కృతికి ప్రతినిధులై ప్రశ్నిస్తారు. ఏదో తీరని నష్టమే జరిగినట్టు నెత్తినోరూ మొత్తుకుంటారు. ప్రతీ క్షణం తనను కాపలా కాస్తుంటారు.

ఆలోచిస్తూ నీరసంగా కూర్చుండిపోయింది గంగ. తన వాళ్లనుకున్న వాళ్లంతా తనను వేరు చేసి చూసే ఆలోచనల దగ్గరే ఆమె ఆలోచనలు ఆగిపోయాయి. వారం రోజుల కింద స్కూల్లో జరిగిన సంఘటన గుర్తొచ్చింది గంగకు.

స్కూల్లో ఆయమ్మ ఉన్నా తనే ఇంటింటికి వెళ్లి పిల్లలను తీసుకస్తుంది. పిల్లల పట్ల చూపే శ్రద్ధకు అందరూ గౌరవిస్తారు. ఏ ఇంటికి వెళ్లినా చాయ తాగనిదే వదలరు. ఆపద సంపదలుంటే చెప్పుకుంటారు.

ఆరోజు పిల్లలకు బంతిపాటను నేర్పిస్తుంది. శ్రీజ పాటను వినకుండా అల్లరి చేస్తుంది. అయ్యవార్ల పిల్ల. తెల్లగా ముద్దుగా ఉంటుంది. దగ్గరికి తీసుకొని ముద్దాడి ముచ్చట్లోకి దింపింది.

"టీచర్... మా తమ్ముడు మీ టీ కప్పును పలగ్గొట్టిండు..." ముద్దుముద్దుగా చెప్పింది శ్రీజ. వయసు నాలుగేండ్లే అయినా పుట్టెడు బుద్ధులున్నయి. స్పష్టంగా ఒత్తిపలికి మాట్లాడుతుంది.

గంగకు ముందుగా అర్థం కాలేదు. సమాధానాలన్నీ ఒకదానికొకటి అతుక్కుంటే తను వాళ్ల ఇంటికి వెళ్లినప్పుడల్లా ఇచ్చే టీ కప్పును బయట గూట్లో వేరుగా పెడతారని అర్థమయింది. విషయం చిన్నదే అనిపించినా గుండెను కెలికినట్టనిపించింది. తన గుణం కాకుండా, చేసిన సహాయం కాకుండా, కులాన్ని మాత్రమే గుర్తుకు తెచ్చే బలమైన అంశం ఏమిటో గుర్తుకు రాలేదు.

శ్రీజ తల్లి శ్రీదేవిది తన ఈడే. భర్త చనిపోయాడు. తల్లి వద్దే ఉంటుంది. తండ్రి కూడా లేడు. ఆర్థికంగా ఇబ్బందులున్న కుటుంబమే. తనే ఆపద్బంధు పథకం కింద డబ్బును ఇప్పించింది. బ్యాంకుల చుట్టూ తిరిగి లోన్‌ను ఇప్పించింది. జన్మభూమి స్కీంలో కుట్టు మిషన్‌ను ఫ్రీగా ఇప్పించింది. డ్వాక్రా గ్రూప్‌లో చేర్పించి లీడర్‌ను చేసింది. ఆమె కూడా తనతో చనువుగా ఉంటుంది. ఇంతకా కలిసిపోయి కూడా తనను ఆమోదించలేని ఆలోచనకు మూలం ఏమిటో తెలిసి రావడం లేదు గంగకు.

ఆలోచనల్లో పడి భర్త రాకను కూడా గమనించలేదు గంగ.

"ఏందే... బీరిపోయి కూసున్నవు. పొయ్యి మీద ఏదో పొంగుతున్నట్టుంది. కమురు వాసనత్తుంది. ఈ బతుకమ్మను పేర్చుడేందోగనీ నువ్వు యాడ కూసుంటె ఆడనే గోడలెక్క బీరిపోతున్నవు" ఇంట్లోకి అడుగు పెడుతూనే అన్నాడు శంకర్.

అప్పటిగ్గాని తేరుకోని గంగ వంటింట్లోకి పరుగెత్తింది. సద్దిపులుసు పొంగి స్టౌ మీద మడుగు కట్టింది. మంట తగ్గించి బట్టతో శుభ్రం చేసింది. మూతను కడిగింది. గిన్నె చుట్టూ తుడిచింది.

"సద్ది పులుసుతో పులిహోర చేసి వైనం పంచుతవంటే ఇక్కడనే పొంగ వెదుతున్నవా...?" నవ్వుతూ అన్నాడు శంకర్. మారు పలుకలేదు గంగ. మౌనంగా తన పనిలో మునిగిపోయింది. ఆమె సమాధానం కొరకు చూసి మళ్లీ తననే "ఈసారి పువ్వు దొరకదనుకున్న. నర్రెంగల్ల గునుకపువ్వు మొద్దుమడుగు గుడ్డంల తంగేడుపువ్వు ఇరుగ పూసిందట. బర్లకాడి లింగడు చెప్పిండు. తెంపుకుని రమ్మని చెప్పిన. ఇయ్యల్లగునుగు రేపు తంగేడు తెత్తనన్నడు. తంగేడు పువ్వు నిద్రపోవద్దు గదా" అన్నాడు.

టక్కున తలెత్తిచూసింది గంగ. అతడిలో అనుకరణ భావజాలం కనిపించింది. అది ఎప్పటి నుండో కనిపించినా అది ఇదని గుర్తు పట్టలేకపోయింది. తనను ఇతరులు గౌరవించడం వరకే తన ఎదుగుదలగా భావిస్తున్నాడు. ఎమ్మెల్యేతో మాఘమాసం నాడు గుడికి వెళ్ళినప్పుడు పూజారి నెత్తిమీద శఠగోపం పెట్టకుండానే పై నుండి ప్రసాదం జారవిడిచినప్పుడు అది తను సాధించుకున్న హక్కుగానే చూసాడు తప్ప ఇంకా సమానంగా చూడలేక... చూస్తూ ఉండలేక ఎక్కడో తప్పించుకునే మనుషుల మానసిక స్థితిని అంచనా వేయడం లేదు. అది గంగకు బాగా తెలుసు.

"పెద్ద బతుకమ్మను పేరుద్దామంటరా...?" అసహనాన్ని అనుచుకుంటూ అడిగింది గంగ. విచిత్రంగా చూసాడు శంకర్. బతుకమ్మ విషయమై ఆమె పూర్తిగా ఒప్పుకుందనుకున్నాడు. ఇంకా అనుమానంతో అటూ ఇటుగానే ఉందని ఇప్పుడు అర్థమయింది. "ఏం... ఎందుకలా అడుగుతున్నావు" అన్నాడు అనుమానంగా.

స్టౌ మీది గిన్నెను దించుతూ "ఏం లేదు... సోపతెవలు లేరని..." అన్నది.

ఆమె ఇంకేవో కారణాలు చెబుతుందనుకున్న శంకర్ తేలికగా నవ్వుతూ "నీకు సోపతి కరువా...? బతుకమ్మను ఎత్తుకుని కచీరు కాడికిపో. కొత్త బస్టాండుకు పో. లేదంటే కోమట్ల వాడకు. అక్కడ కూడా పోనంటే రెడ్డీలవాడకు, మునూరు సంఘం ముందుకు, పటేండ్లల వాడకు పో. నాలుగడుగులు ఎక్కువ నడువాలనుకుంటే కోలుగడ్డకో గరిసెలగడ్డకో పో. సోపతి కరువా... అసలు నన్నడిగితే మన ఇండ్లల్ల పేర్చినా నువ్వు వాళ్లతోని కలువద్దు. డిగ్నిటీ మెంటన్ జెయ్యాలె" అన్నాడు.

అర్థం కానట్టు చూసింది గంగ. ఎం.పి.టి.సి.గా రాజిరెడ్డి మీద ఎక్కువ మెజారిటీతో గెలిచినప్పటి నుండి అతడి ఆలోచనలు మాటలు పూర్తిగా మారిపోయాయి. ఏదో అడుగుదామనుకునే లోపే ఫోన్ మోగింది. శంకర్ ఎత్తి 'గంగా... నీకే తిరుమలరావు బిడ్డ హరిత' అంటూ ఫోన్ అందించాడు.

గంగ ఫోన్ అందుకుని 'హలో... ఎప్పుడచ్చినవు' అన్నది. హరితకు కొత్తగా పెళ్లయింది. ఇంటర్ ఫేలయి



ఇంట్లో కూర్చుంటే గంగనే ఓపెన్ డిగ్రీలో చేర్పించింది. డిగ్రీ పూర్తి చేసి ఇప్పుడు పీజీలో చేరింది హరిత.

"నిన్ననే... నీతో పనుంది" బయట నుండి హరిత నవ్వుతూ.

"పనుంటే తప్ప ఎందుకు ఫోన్ చేస్తావు! ఇంతకీ ఏం పని. హాస్పిటల్కా బ్యాంకుకా కాలేజీకా...?" అడిగింది గంగ.

"హాస్పిటల్కే... అమ్మ వస్తానంటుంది. నేను నిన్నే తీసుకెళ్తానన్నాను. నువ్వయితే డాక్టర్తో వివరంగా మాట్లాడుతావు" హరిత గొంతులో సిగ్గూ బిడియం.

"అర్థమయిందిలే... అప్పుడే విశేషమా...? రేపు సద్దుల బతుకమ్మ పండుగ కదా! ఎల్లుండి పోదాం." అన్నది గంగ. కొద్దిసేపు మాట్లాడి ఫోన్ పెట్టేసింది.

అంతవరకూ ఓపిగ్గా చూస్తున్న శంకర్ "ఎల్లుండి ఏ పనీ పెట్టుకోకు. ఎం.పీ.పి. జడ్.పీ.టీ.సీ.లు వత్తంద్రు" అన్నాడు.

"ఎందుకు...? మీకేం పని లేదేంటిది. ఎంపీపిని నెత్తికెత్తుకుని ఊరేగుతంద్రు" స్టౌ వద్దకు వెళ్తూ అన్నది గంగ.

"సి.సి. రోడ్డు, మోరీ పనులు చూసి పోనీకి వత్తరట. కాంట్రాక్టర్ను నేనే గదా! చిన్న దావతు జెయ్యాలె. వంట పని ఉంటది" అన్నాడు డైనింగ్ టేబుల్ ముందు కూర్చుంటూ.

స్టౌ మీద టీ గిన్నె పెడుతున్నదల్లా ఆగిపోయి వెనక్కి తిరిగి చూసింది గంగ. "వంట మాత్రం మనింట్లో. తినుడు మాత్రం రావుల ఇంట్లనో రెడ్డీల ఇంట్లనో. ఎంపీపికి మీ మాట గావాలె. మద్దతు గావాలె. తిండి గావాలె. ఇల్లు మాత్రం వద్దు. ఇంట్లో కూసుండి తింటే నామోషి. ఈసారి మన ఇంట్లో కూసుండి తింటేనే వండి పెడుత" తిక్కగా అన్నది.

శంకర్ ఒక క్షణం మాట్లాడలేదు. గంగ మామూలుగా కాకుండా నిలదీసి అడుగుతున్నట్లుగా అనిపించింది. అప్పుడప్పుడూ గంగ మాటలు చెంప మీద కొట్టినట్టుంటాయి. తను గుర్తించని సూక్ష్మమైన

అంశమేదో గుర్తు చేసినట్టుగా ఉంటాయి. కాని అవెందుకో అంతగా సీరియస్‌గా అనిపించవు అతనికి.

"నీవన్నీ పాతకాలవు ఆలోచనలే... ఏదో ఊహించుకుని నీకు నీవు ముడుచుకుపోతావు. ఎప్పుడో ఉన్నట్టు ఇప్పుడు అంటూ ముట్టూ ఉన్నదా...? మన ఊర్లైనే చూడు. మనం ఎవల ఇంటికి వెళ్లినా కుర్చీ వేసి కూచోబెడుతారు. అందరూ మనను సమానంగానే చూస్తున్నారు. నువ్వే పాత వాసనల్ని విడువలేక తొక్కుకుంటున్నావు. నీలో ఉన్న ఇన్ఫిరియారిటీని విడువలేకపోతున్నావు" అన్నాడు శంకర్.

మరుగుతున్న టీని కప్పుల్లో పోసింది గంగ. భర్తకు ఏం చెప్పాలో ఎలా చెప్పాలో అర్థం కాలేదు. అతడు అంతకు మించి లోతుగా ఆలోచించడని మాత్రం తెలుసు. టీ కప్పును అందిస్తూ "సమానంగా చూడడం ఒక నెపం మాత్రమే! గౌరవించడం ఒక అవసరం మాత్రమే! మను సిద్ధాంతాలు మనుషుల్లో ఇప్పటికీ పదిలంగానే ఉన్నాయి. హక్కులనీ, సాధించుకున్నామని, సమానత్వమనీ మీలాంటి వారంటారు. జరగాల్సిన మార్పు జరగనే లేదని నేనంటాను. 'మా ఊరికి రండి' ఉద్యమం ఉధృతంగా సాగినప్పుడు ఎస్సీ టీచర్లకు రూం కిరాయికి దొరుకలేదంటే నమ్ముతారా? ఇంతెందుకు? మీ ఫ్రెండ్స్ భార్యలను చూడండి. హాస్పిటల్‌కో బ్యాంకుకో పిలిచినంత అవసరంగా నోములకో, వైనాలకో, పసుపు బొట్లకో పిలువరు" అన్నది.

టీ కప్పు అందుకుని తాగబోతూ ఆగిపోయాడు శంకర్. ఇంకో కప్పుతో భర్తకు ఎదురుగా కూర్చుంది గంగ. "నువ్వు చిన్న విషయాన్ని కూడా బూతద్దంలో చూస్తావు. సిటీల్లో చూడు. కులం మతం ఎక్కడైనా ఉంటుందా...? అందరూ సమానంగానే ఉన్నారు..." ఇంకా చెప్పబోతుంటే నవ్వును ఆపుకోలేక పకపకా నవ్వింది గంగ.

శంకర్ ఉక్రోషంగా చూసాడు. గంగ నవ్వును ఆపుకుంటూ "బస్సుల్లో కూర్చుండి చూస్తే అలాగే కనిపిస్తుంది మీకు. వాళ్ల జీవితపు మూలాల్లోకి వెళ్లి చూస్తే తప్ప మీకు వాస్తవం కనిపించదు. గరుకగడ్డి వేర్లుంటయి చూడండి. మట్టిలో ఏమూలనో అణువంతగా దాక్కుంటాయి. ఎండాకాలం వస్తే భూమి మొత్తం దుమ్మదుమ్ముగా మారి గడ్డి వేర్ల ఆనవాళ్లే కనిపించవు. అసలు గడ్డి వేర్లే లేవని, ఉన్నా ఎండి పోయాయనుకుంటాం. ఒక్క వర్షం పడి భూమి భూమంతా తడిసిందనుకోండి. లేదనుకున్న గడ్డి సూది మొన సందు లేకుండా మొలకెత్తుతుంది. ఈ మనుధర్మమూ అంతే! సమాజంలో జీర్ణించుకుపోయింది. మనకు లేనట్టుగానే కనిపిస్తుంది. అవసరం అవకాశం వచ్చినప్పుడు అందరిలోనూ మొలకెత్తుతుంది. కారంచేడు, చుండూరు నుంచి ప్యాపిలీ దాక దీన్ని చూస్తూనే ఉన్నాం" అన్నది.

టీ పెదవులకు తగిలి చురుక్కుమంది శంకర్‌కు. అంతకంటే చురుకుగా తగిలాయి గంగ మాటలు. ఇంత తీవ్రమైన భావాలున్న వారు ఎవరైనా సమాజంలో అంత తొందరగా కలిసిపోరు. గంగ అలాకాదు. అందరితో తొందరగా కలిసిపోతుంది. అందరినీ కలుపుకుపోతుంది. ఏ ఆలోచనా లేని మామూలు మనిషిలా కనిపిస్తుంది.

ఇంతకు ముందు ఒకసారి అదే విషయం అంటే "ఆలోచించడం వేరు. సంబంధాలు కొనసాగించడం వేరు. అయినా సంబంధాలు నేను కొనసాగించడం కంటే నాతోనే వాళ్లు కొనసాగిస్తున్నారు. అవసరాలతో నన్నే వేరుచేసి చూస్తున్నారు. గ్రామదీపికగా నేను కావాలి. స్కూల్లో టీచర్ లేకుంటే నేను కావాలి. ఏ.ఎన్.ఎం. లేకుంటే నేను కావాలి. సర్వేలకు రిపోర్టులకు నేను కావాలి. నా అవసరం అంతవరకే! గుడిలో పూజలకో యజ్ఞోప విధులకో అయితే సర్పంచ్ భార్యనో ఇంకెవరో కావాలి. ఎన్నడన్నా నిన్నూ నన్నూ రాములవారి పట్టువస్త్రం ప్రదానానికి రమ్మన్నారా..." అన్నది.

"మమ్మీ..." పిలుపుతో ఇద్దరూ తేరుకున్నారు. ఎనిమిదేండ్ల కూతురు తులసి వచ్చి తొడ మీద కూర్చుంది. కాళ్లు చేతులు కడిగి కుర్చీలో కూర్చోబెట్టి అన్నం కలిపి ఇచ్చింది గంగ.

"నాక్కూడా అన్నం పెట్టు..." శంకర్ అన్నాడు.

"పెట్టుకోండి. మీక్కూడా కలిపి పెట్టాలా..." కోపాన్ని నటిస్తూ అన్నది గంగ. తులసి తండ్రి మొహంలోకి చూసి నవ్వింది. శంకర్ డైనింగ్ టేబుల్‌ను గుండ్రంగా తిప్పి ప్లేట్‌ను అందుకున్నాడు.

గంగ టీ.వి. స్విచ్ ఆన్ చేసింది. టీ.వీ.లో ముఖ్యమంత్రి సహపంక్తి భోజనం చేస్తున్నాడు. దేవాలయ ప్రవేశాలు చేయిస్తున్నాడు. కులం గురించి ఏదో తెలియజేస్తున్నాడు. మరేదో మనవి చేస్తున్నాడు.

"ఈ సమస్య చూడు. చివరకు ఓట్ల ఖజానా అయింది. కాస్తంత సానుభూతి చూపి ఓట్లను గుంజుకుంటున్నారు" అన్నది నిట్టూరుస్తూ.

అప్పుడే వచ్చాడు గ్రామ సుంకరి. కవరు నిండా దోసకాయలు తెచ్చి గంగకు ఇచ్చిపోయాడు. అర్థంకాక శంకర్‌వైపు చూస్తే "నేనే తెప్పించిన. రేపటి పలారానికి" అన్నాడు శంకర్.

"నన్ను కలువనివ్వరు. రేపు నేను బతుకమ్మ పేర్వను గాక పేర్వను. వాళ్లు నన్ను అదోరకంగా చూస్తున్నారు. పైకి అనకపోయినా లోలోపల గొణుక్కుంటున్నారు. నిన్న మొన్న చిన్న బతుకమ్మలప్పుడు వేరు. రేపు పెద్ద బతుకమ్మ ఊరంతా వస్తారు. మనిషికొక మాటంటే పడలేను." మనసులోని మాటను అనేసింది గంగ బాధగా.

ఈసారి శంకర్ నవ్వును ఆపుకోలేకపోయాడు. అన్నం కలుపుతూ "పొలిటికల్ సైన్స్ నీ కొంప ముంచింది. డిగ్రీలో చేరిన నుండే నీకీ ఆలోచనలు వస్తున్నాయి. సామాజిక ఎదుగుదలను నీవు మరో కోణంలోంచి చూస్తున్నావు. నీకో కథ చెబుతాను విను. ఒకచోట పది మంది బ్రాహ్మణులు యజ్ఞం చేస్తున్నారట. పనులను చేయడానికి ఒక కూలీని పెట్టుకున్నారట. బ్రాహ్మణులు మడిమీద కూర్చుండి ఏదో పని చెప్పడం, అజాగ్రత్త వల్ల వాడిని తాకడం, అయ్యో అనుకుని మడి మార్చడం స్నానం చెయ్యడం చేస్తున్నారట. ఈ ఇబ్బందిని గమనించి తెలివైన బ్రాహ్మణుడొకరు కూలీవాన్ని పిలిచి పాపపుణ్యాల గురించి చెప్పి వాళ్లు నీకు తాకినా నువ్వు వాళ్లకు తాకినా పాపం అంటుకునేది నీకే అన్నాడట. ఆనాటి నుండి వాళ్లు ఎంత నిర్లక్ష్యంగా ఉన్నా కూలీవాడే పెయ్యంత కండ్లు చేసుకుని దూరంగా ఉంటూ వాళ్లకు బాధల్ని తప్పించాడట" అన్నాడు.

"అంటే..." పాపకు మరింత అన్నాన్ని పెడుతూ అన్నది గంగ.

"మనకు మనం భయపడి వాళ్లతో కలువలేకపోతున్నాం. మనం ఇదే ఆలోచనతో ఉన్నాం కాబట్టి వాళ్లు ఏమన్నా మనకు అదే అర్థం స్ఫురిస్తుంది. ఒకసారి చొచ్చుకపోతే మరోసారి అలవాటవుతుంది. లేదంటే శతాబ్దాలు గడవనిగాక మనం ఇంట్లనే ఉంటాం. వాళ్లు అట్లనే ఉంటారు. అయినా ఇప్పుడు వాళ్లు మారిపోయారు. మారాల్సింది మనమే" అన్నాడు.

గంగ వాదించలేదు. బతుకమ్మ కొరకు తాంబోలం వెదుకుతుంది భయం భయంగా.

✣ ✣ ✣

## ఆలాపన

**ఈ** చిగుళ్లది
ఎంత క్షమాబుద్ధి!
ఈ చిగుళ్లది
ఎంత సొగసుతనం, ఎంత నాజూకుదనం!
బాంబు పేలుళ్లలో విరజిమ్మిన నిప్పుల్లా
మనిషి చిగుళ్లని మాడ్చేస్తున్నా
చిన్ని చిన్ని అరచేతుల్తో
ఆకాశాన్ని వర్షపు పందిరిలా నిలబెడ్తున్న
ఈ చిగుళ్లది ఎంతటి దయాగుణం!

ఎర్ర మబ్బుల సాయం సంధ్యని
క్రికెటు పిచ్‌లా చేసుకొని
యుద్ధ ట్యాంకర్లు పరుగెడుతున్నాయి
తాటి పండులా రాలుతాడేమో అనుకున్న సూర్యుడు
ఒక్క వేటుకు తెగిన బలిమేక తలకాయలా
రాలిపడ్తున్నాడు
మాయల తొర్రల్లాంటి రెండు బుర్రలు
అవనిమీద అంగుళంగుళం
వాళ్ళబ్బ సొత్తన్నట్టు
కంచెలు తెంచుకుని మరీ దాడి చేస్తూ
స్తంభించిన సంధ్యకు కారకులవుతున్నారు
పాటలో తేగెలు సాగబోయే ఆలాపనని
అరచేతుల్తో నొక్కేస్తున్నారు, ప్రాణ వాయువు
లాపేస్తున్నారు

పక్క వాడిని ముట్టుకుంటే చాలు
నురగలు కక్కుతూ ఉంటావు నీవు
తలుపులూ, సొగసులూ
అన్ని యుద్ధ సంధ్యల్లోనే-
తెగిన గొంతుల్లోంచి కారే రక్తాక్షరాలు
'బూడిద' అన్న పదాన్ని రాయొద్దంటున్నాయి
ఓ విస్ఫోటనం తరువాత
చెల్లాచెదురైన నిశ్శబ్దం యిపుడు
ఈ నిశ్శబ్దం
కొత్త శబ్దానికి మాతృక
ఓ కొత్త చరితకి సూచిక

శరీరావయవాలూ,
వాటి శరీర న్యాయమే ఈ
ప్రపంచానిదీనూ

-ఒబ్బిని

పట్టు చీర కట్టుకుని బతుకమ్మ నెత్తుకుంది గంగ. తీరొక్కపువ్వుతో బుద్ధిదీరా పేర్చుకుంది. పెద్దది ఇత్తడి తాంబోలం. గునుగు తంగేడు సగం సగం చుట్లు తింపి పైన కాగితం బతుకమ్మ నుంచి దారాలతో కట్టింది. రెండు ఊదు బత్తీలను చెక్కింది. చిన్నతపుకులో గౌరమ్మను పేర్చి కూతురుకిచ్చింది. పులిహోర, దోసకాయ పలారం, మలీదముద్దలను భర్తకిచ్చింది.

డాంబర్ రోడ్డు వెంట గంగ కదిలింది. వెంట కూతురు. స్కూటర్ మీద తర్వాత వస్తానన్నాడు శంకర్. నడుస్తుంటే కాళ్లు తడబడుతున్నాయి. నల్లటి మేఘాలు పైపైకి వస్తున్నాయి. వానపడ్డా బాగుండుననుకుంటుంది. మాల పోచమ్మ మత్తడి దాటి కొత్త బస్టాండుకు రాగానే బతుకమ్మల గుంపు కనిపించింది. ఒకచోట ఆట సాగుతుంది. ఇంకోచోట జనం గుంపు గూడి ఆటను మొదలుపెట్టబోతున్నారు.

ఆట మొదలయ్యే గుంపు దగ్గరికి వెళ్లి బతుకమ్మను దించింది గంగ. కూతురు చేతుల్లోంచి గౌరమ్మను అందుకుని పక్కనే పెట్టింది. అన్నింటిలో తన బతుకమ్మనే ఎత్తుగా గుండ్రంగా చెక్కినట్టు అందంగా కనిపిస్తుంది. బతుకమ్మ వైపు ఒకసారి తృప్తిగా చూసి గుంపులోకి వచ్చింది.

అప్పటికే పుట్ట బెదిరింది. అందరూ అదోరకంగా చూస్తున్నారు. అన్నీ తెలిసిన మొఖాలే. పరిచయమున్న మొఖాలే. కానీ కొత్తగా ముసుగులు వేసుకున్నారు. కొందరు చూడనట్టు తప్పుకుంటున్నారు. కొందరు కొత్తగా చూస్తున్నట్టున్నారు. మొహమాటానికి కొందరు మాటలు కలిపినా పక్కవాళ్లను చూసి బిడియపడుతున్నారు. వాళ్లు తనను ఎంతవరకు ఆమోదించాలో అంతవరకే ఆమోదించారు. ఈ మార్పును జీర్ణం చేసుకోలేకపోతున్నారు.

మొదలు కావాల్సిన ఆట మొదలుకాలేదు. గుంపులో నిలబడ్డా ఒంటరిదయింది గంగ. తల్లి చేతిని పట్టుకుని ఆసక్తిగా చూస్తుంది తులసి. తనను చూసి తప్పుకుంటున్నారని తెలిసినాక చేష్టలుడిగినట్టు ఆమె మౌనంగా ఉండిపోయింది.

కారంచేడు కాల్పుల కంటే, ప్యాపిలి కత్తులకంటే వీళ్ల చూపులే భయంకరంగా కనిపిస్తున్నాయి. వీళ్ల మౌనమే నిలువునా కాల్చివేస్తుంది. కట్టెలు లేవు, కటార్లు లేవు. లొల్లిలేదు, బొబ్బలు లేవు. ఉరుకులు పరుగులు అసలే లేవు. అంతా ప్రశాంతంగానే ఉంది. అయినా యుద్ధం జరుగుతుంది. గంగ విలవిలా కొట్టుకుంటుంది.

ఆలోచనల్లోంచి బయటపడి చూస్తే అక్కడ ఒక్కొక్క బతుకమ్మ లేస్తుంది. లేచిన బతుకమ్మ ఇంకో గుంపులో కలుస్తుంది. చూస్తుండగానే గంగ బతుకమ్మ గౌరమ్మ మాత్రమే మిగిలాయి. ఏం జరిగిందో తెలియని తులసి తల్లికి వేలెత్తి చూపిస్తుంది.

కొద్దిసేపు ఆలోచించి మొండిగా కదిలింది గంగ. అప్పటికే చిన్న గుంపు పెద్దదై ఆట సాగుతుంది. మనసుల్లో కదిలిన ఏదో భావన గంగను ఊరును వేరు చేసింది. అదే భావన ఊరు ఊరునంతా ఒక్కటి చేసింది.

పాట జోరుగా సాగుతుంది. చప్పట్లు మోగుతున్నాయి. ఆటకు తొవ్వదీసే కాపోల్ల పెద్దమ్మను, పాట పాడే కుమ్మరోళ్ల చిన్నమ్మను, చేతులు కలుపరాని కమ్మరోళ్ల కొత్త కోడలును, కొత్త కోడండ్లకు ఆట నేర్పుతున్న శాతాని ఎంకవ్వను, పిల్లలను అదిలిస్తూ మంచిగా తిరుగుండ్రని కంటి చూపుతో బెదిరిస్తున్న బెస్తోల్ల నర్సమ్మను, ఆటమోటని అలంకరించుకుని వచ్చి అరుగుల మీద కూసున్న కాలేజీ పిల్లలను... అందరినీ చూస్తూ గుంపులో బతుకమ్మను దించింది గంగ.

గుంపు చెదిరిపోలేదు కానీ కొద్దిగా కంపించింది. పాట పాడే ఎల్లవ్వ కొద్దిసేపు ఆపి మళ్లీ అందుకుంది. ఇచ్చుకపోదామని చూసిన ఒకరిద్దరు పెదవి విరుస్తూ కాలు కదిపారు. గుండ్రంగా తిరుగుతున్న మందిని ఒకసారి చూసి తనతో చనువుగా ఉన్న లలిత దగ్గర చోటు చేసుకుని జోడీగా ఆటపట్టింది గంగ.

గంగవైపు నవ్వుతూ చూసి చుట్టూ బిడియంగా చూసింది లలిత. అందరి చూపులు తనపైనే ఉన్నాయని గ్రహించాక నాలుగు చుట్లు తిరిగి "నెత్తిల తిరుగుతుంది. కొద్దిసేపు కూసుంట" అని పక్కకు జరిగింది. అటుపక్కన ఇటువక్కన ఏదో కారణం చెప్పి పక్కకు తప్పుకుంటున్నారు.

ఆలోచనలన్నీ పక్కకు పెట్టి ఆట ఆడాలని చూసింది గంగ. కాళ్లలో కాళ్లు కదిపి చేతుల్లో చేయి కదుపుతుంది. ఎవరో గద్దిరించి అదిలిస్తే పక్కకు తిరిగి చూసింది. నుదుటిమీద రూపాయి బిళ్లంత బొట్టుతో తెనుగోళ్ల ఎల్లమ్మ.

"ఏంది పిల్లా... కాళ్లు తొక్కుతున్నవు. కండ్లు కనువడుతలెవ్వా... లేకి ముండకు సిరత్తె లేచిలేచి ఉరికిందట. మీ వాడకు మీరు పెట్టుకుంటే వద్దన్నమా...? మా దగ్గెరికి ఎందుకు రావాలె." గాయికెత్తుకుంది ఎల్లమ్మ.

ఆట ఆగిపోయింది. జనం గుంపుకూడారు. ఎల్లమ్మ లొల్లికెత్తుకుంది. గంగ నోట మాట రాలేదు.

"ఆ... కావురమా ముండకు. కండ్లు నెత్తికెక్కినయా...? కాలుతోని తంతదా... ఎటువాయె అది... బూరెంటికెలువట్టి దంచుత. చిన్న లేదు పెద్దలేదా...? దానికి పైసుంటే... మలిచి పెట్టుకోని..." ఎల్లమ్మ కోడండ్లు అందుకున్నరు.

అక్కడనే కొంతమంది ఎల్లమ్మను సముదాయిస్తుండ్రు. ఒకరిద్దరు గంగ చెవిలో "కాలు లేదు ఏలు లేదు వట్టిగనే ఒర్రుతుంది. నువ్వేం భయపడకు" అంటుండ్రు. అరుగుల మీద మొగోళ్లు ఆసక్తిగా చూస్తుండ్రు.

"అయితాయె తియ్యి వత్తెవచ్చె. ఎవలదన్న ఎత్తుకపోతుందా...?" మందిలోంచి ఎవలో అన్నరు. ఎల్లమ్మ కొడుకులిద్దరు "ఆడోళ్లు ఆడోళ్లు కొట్లాడుకుంటండ్రు. మనకెందుకులే" అనుకుని దూరం నుంచే చూస్తండ్రు.

గంగ తేరుకునేలోపే లొల్లి సద్దుమనిగింది. దూరంగా దప్పుల చప్పుడు వినిపించింది. సుట్టబట్టలు పెట్టుకుని బతుకమ్మని నెత్తినెత్తుకుంటున్నారు. గుంపు చెరువువైపు కదులుతుంది. గంగ బతుకమ్మ దగ్గరికి వచ్చింది. అప్పుడే అక్కడికి వచ్చాడు శంకర్. అయోమయంగా భార్యాభర్తలిద్దరూ మొఖాలు చూసుకున్నారు. అంతవరకు భయం భయంగా చూస్తున్న తులసి తండ్రిని చుట్టుకపోయి బావురుమని ఏడ్చింది.

అదికాదు వాళ్లను కదిలించింది... అక్కడ... ప్రేమగా నమ్మకంగా పేర్చుకున్న బతుకమ్మ ఇచ్చుకపోయింది. పువ్వులు మట్టిలో కలిసి మనుషుల పాదాల కింద నలిగిపోతున్నాయి. ●

## స్పర్శానుభవం

ఒక చలచల్లని చలి సాయంత్రం.
ఒంటరిగా వాహ్యాళికెళ్లి
చేతులు ముడుచుక్కూచుంటే
బెంచీ కింద ఎక్కడిదో ఒక పిల్లి.
దాని ముద్దూ మురిపానికి ముచ్చటపడి
ప్రేమ మీరా పలకరిస్తే
సుదూర విరామం తర్వాత కలిసిన బాల్య మిత్రునిలా
చాపల్యం కొద్దీ దగ్గరకొచ్చింది.
మిలమిల మెరిసే రేడియం కళ్లతో
మోమంతా కలయజూసి
మార్దవం తొణికిసలాడే
గోము గొంతుతో ఒకసారి పలకరించి
తోకను గాలిలోకి నిలబెట్టి
చెర్నకోలాలా ఆడిస్తూ
తన మెత్తని నాజూకు ఒంటిని
నా మీగాళ్లకు ఒరుసుకుంటూ
అటు తిరిగీ ఇటు తిరిగీ
చూస్తుండగానే
చిక్కటి సాయం సంధ్యలోకి అదృశ్యం అయిపోయింది.
అది వెళ్లిపోయాక
పురాస్మృతి లాంటి
దాని రోమాంచిత స్పర్శేదో
జెర్రిలా ఒళ్ళంతా జరజరా పాకింది.
అది నా వెంట నడిచి ఒచ్చిన జాడ
తెలియ రాలేదు గానీ
అప్పటి నుండీ
చడీచప్పుడూ లేని
దాని మృదు పద నిశ్శబ్ద ధ్వని ఏదో
నాలోన
లోలోన
నిరంతరం వినబడుతూనే వుంది.
అది మొదలు
కనబడని అదృశ్య దేహంతో
అది నన్ను ఆపాద మస్తకమూ స్పృశిస్తూనే వుంది.
భౌతికమైన స్పర్శను
ఆత్మికం చేసి
అది నిత్యం నన్ను వెంటాడుతూనే వుంది
దీని సంచారం
వెలుపలే అయితే
అదిలించో బెదిరించో
ఉస్కో అనో
పార దోలుదును.
కానీ
నా లోలోపలి
నాడులలో సుడులు తిరిగే
అంటీ అంటని
దీని పాదరసపు స్పర్శను
ఇప్పుడు
వున్నట్టుండి
బయటికి పంపడమెలా?

–శిఖామణి